క్లుప్తంగా

89 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ధీరజ్

నాతవరం : కాలానుగుణంగా వస్తున్న వ్యాధులు పట్ల ప్రజలంతా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నాతవరం పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి ధీరజ్ అన్నారు. మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నెలపాలెంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 89 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసి పలు సూచనలు చేశారు. తాగునీటి పథకాలు బోర్లలో క్లోరినేషన్ చేసి కాచి చల్లార్చి తాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కోరుప్రోలు వెంకటరమణ, పీహెచ్‌ఎన్ త్రివేణి, హెల్త్ అసిస్టెంట్ పోలుపర్తి బైరాగి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వి.సంతపాలెంలో సంచార చికిత్సలు

కె.కోటపాడు : అనారోగ్య సమస్యలు గల వారికి వివరించే ఆరోగ్య జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో సోమవారం సంచార చికిత్స కార్యక్రమాన్ని జరిపారు. జ్వరం, జలుబు, బి.పి, సుగర్ వ్యాధిగ్రస్తులైన 136 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్‌ఎం.పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుగ్రాస విత్తనాలు పంపిణీ



వి.వి.అగ్రహారంలో పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్:పశుగ్రాస వారోత్సవాలు సందర్భంగా వి.వి.అగ్రహారం గ్రామంలో కింతలి పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. రైతులకు రెడ్ నేపియర్ గడ్డి కనుకలను, కాకిజొన్న విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. లంపిస్కిన్ వ్యాధి నివారణకు టీకాలు వేసారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ సహాయకులు కన్నంనాయుడు పాల్గొన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం

నర్సీపట్నం : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కె.రాజులనాయుడు ఎన్నికయ్యారు. నర్సీపట్నం జి.వి.ఆర్ హెల్త్ జిమ్ సభ్యులు సోమవారం సన్మానం ఏర్పాటు చేశారు. రాజులనాయుడిని జిమ్ సభ్యులు శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. జిమ్ అధినేత పురుషోత్తం, ట్రైనర్ సురేష్, ఏకా రాజు పాల్గొన్నారు.

మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అప్పలరాజు

మాడుగుల: మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పుప్పాల అప్పలరాజు, వైస్ చైర్మన్‌గా దాలిబోయిన రామగోండ్‌లు నియమితులయ్యారు. తమతో పాటు మరో 17 మందిని సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏఎంసీ చైర్మన్ అప్పలరాజు తెలిపారు.

ఎండుతున్న వరినారుమడులు



పోతనవలసలో వర్షాలు లేక సమంగా ఎదగని వరినారు

కె.కోటపాడు : ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలతో సేదతీరిన ప్రజలు, ప్రస్తుతం కాస్తున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రధానంగా ఖరీఫ్ సాగుకు వరినారుమడుల్లో విత్తనాలను వేశారు. అయితే పది రోజులు గడుస్తున్నా వర్షం పడకపోవడంతో అందుబాటులో ఉన్న వ్యవసాయ బావులు, మోటార్‌ల నుంచి నీటి తడులను నారుమడులకు రైతులు అందిస్తున్నారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో వరినారుమడులను సిద్ధం చేసిన రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.

సీడీపీవో శశికళ బాధ్యతల స్వీకారం

మాడుగుల రూరల్ : మాడుగుల ఐసీడీఎస్ సీడీపీవో టి. శశికళ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సిహెచ్ శ్రీదేవి చింతపల్లి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా శశికళ అనకాపల్లి ఐసీడీఎస్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆమెను సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

14 గ్రామాలకు ఊటనీరే గతి

- వాలాబులో గిరిజనులకు తాగునీటి కష్టాలు
- నాలుగు రోజులుగా పని చేయని మంచినీటి మోటారు
- తాగునీటి కోసం గెడ్డల్లో ఊటనీటిని ఆశ్రయిస్తున్న ప్రజలు



వాలాబు పంచాయతీలో గెడ్డలో ఊటనీటిని సేకరిస్తున్న గిరిజనులు

దేవరాపల్లి : మండలంలోని వాలాబు పంచాయితీ పరిధిలోని ప్రజలు త్రాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. గత నాలుగు రోజులుగా మంచినీటి పథకం మోటారు పని చేయకపోవడంతో పంచాయతీ పరిధిలోని గ్రామాలకు త్రాగు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో వాలాబు పంచాయతీలోని 14 శివారు గ్రామాల ప్రజలు సమీప గెడ్డల్లోని ఊట నీటిని ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. అసలే వర్ష కాలంలో కావడంతో గడ్డల్లో కలుషిత నీరు సేవిస్తే పలు వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. మంచినీటి సరఫరా నిలిచిపోయి నాలుగు రోజులు గడుస్తున్నా స్థానిక పంచాయతీ అధికారులు, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారులు పట్టించుకోలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీపీఎం మండల కార్యదర్శి బి.టి. దొర మాట్లాడుతూ వాలాబులో మంచినీటి పథకం మోటార్ ప్యానల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించి మంచినీటి కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే స్థానిక గిరిజనులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామన్నారు.

క్వారీ లీజు రద్దు కోరుతూ ఆందోళనలు ఉధృతం



రైతులతో క్వారీ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం, కేవీపీఎస్ నేతలు

- క్వారీ, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనలు
- దళితుల ఇబ్బందులపై విచారణ చేస్తామన్న ఆర్డీవో



ఆర్డీవో రమణకు సమస్యలు వివరిస్తున్న నాగరాజు, రైతులు

మాకవరపాలెం: క్వారీ లీజు రద్దు చేయాలంటూ ఆందోళనలు ఉధృతం అవుతున్నాయి. క్వారీ ప్రాంతంలో భూములున్న దళితులకు పలు సంఘాలు మద్దతు తెలియజేస్తున్నాయి. మండలంలోని జీ కోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో నల్లరాతి క్వారీ నిర్వహణకు లీజులు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ క్వారీ కారణంగా సమీపంలో ఉన్న జీడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లుతుందంటూ దళిత రైతులు కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ వీరికి మద్దతుగా సోమవారం సీపీఎం, బహుజన ఐక్యవేదిక, కేవీపీఎస్ సంఘాల నేతలు ఆందోళనలు చేశారు. ముందుగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో జీ కోడూరు వద్ద గల క్వారీ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం బహుజన ఐక్య వేదిక డివిజన్ నేత బొట్టా నాగరాజు తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత రైతులతో కలసి బైఠాయించారు. అధికారులు పేదల పక్షమా లేక, వ్యాపారుల పక్షమా అంటూ నినాదాలు చేశారు. క్వారీ పేలుళ్ల కారణంగా పంటలు నాశనం అవుతున్నాయన్నారు. ఇవే ఆధారంగా దళితులు జీవిస్తున్నారని, క్వారీ లీజులను రద్దు చేయాలని నేతలంతా డిమాండ్ చేశారు. అదే సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత రైతుల ఇబ్బందులను వివరించారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ గురువారం రెవెన్యూ, మైన్స్ అధికారులు క్వారీ వద్దకు వచ్చి, అక్కడ దళితులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుంటారన్నారు. తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎ.అప్పారావు, కార్యదర్శి పెంటయ్య పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాధ

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రిన్సిపాల్ బి.రాధ సోమవారం తెలిపారు. స్థానిక కళాశాలలో జనరల్ కోర్సులో కెమిస్ట్రీ, ఒకేషనల్ కోర్సులో ఈటీ సబ్జెక్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. కెమిస్ట్రీ పోస్టుకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 50 శాతంతో ఉత్తీర్ణత, ఈటీ పోస్టుకు బీటెక్ ఈఈఈలో 50 శాతంతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను అర్హులుగా పరిగణిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల లోపు స్థానిక కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకున్న వారంతా బుధవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లిలోని రాజా సినిమా థియేటర్‌కు ఎదురుగా ఉన్న జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈవో) కార్యాలయానికి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ రాధ సూచించారు.

వెంకన్న ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న అప్పలనాయుడు, యశోద దంపతులు

మునగపాక: వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వెంకన్న ఆలయానికి పలువురు భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం మునగపాకకు చెందిన ఆడారి దొరమ్మ గారి అప్పన్న కుమారుడు అప్పలనాయుడు, యశోద దంపతులు, మనుమడు దినేష్ రూ.2 లక్షల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చురుగ్గా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట వెంకట్, అలంక ప్రకాశరావు, ఆడారి లక్ష్మణరావు, పొలిమేర కృష్ణ, బొడ్డేడ రామునాయుడు, ఆడారి గణేష్, మద్దాల వీరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థుల దంతాలను పరిశీలిస్తున్న ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ వైద్యుడు విశ్వనాథ్

అచ్యుతాపురం: ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ ఎ.విశ్వనాథ్ సూచించారు. మండలంలోని కొండకర్ల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫ్లోరోసిస్ దంతాలకు, ఎముకలకు వచ్చే అవకాశం ఉందని, ముందుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కుర్‌కురే, లేస్, పానీపూరీ, న్యూడిల్స్ వంటి చిరుతిళ్లను ఆహారంగా తీసుకోవడంతో చిన్నారులకు, ఖైనీ, పాన్ పరాగ్, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులను తినడంతో పెద్దలకు ఫ్లోరోసిస్ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. విద్యార్థుల దంతాలను పరిశీలించిన ఆయన అనుమానం ఉన్న విద్యార్థులకు విటమిన్ సీ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు అరుణజ్యోతి, ప్రోత్సాహిణి, షానవాజ్, వైద్య సిబ్బంది మంగ, లక్ష్మి, శ్రీదేవి, శేషారత్నం పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

కోటవురట్ల: నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నాయని, ఇది నిరుద్యోగ యువతకు మంచి అవకాశమన్నారు.

నేడు చీడికాడలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

చీడికాడ : చీడికాడ మండల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థాక తులసీ కల్యాణ మండపంలో జరుగుతుందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు సోమవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశాన్నికి పార్టీ పీఏసీ సభ్యులు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, ముఖ్య అతిథులుగా హాజరవుతారని, సమావేశానికి పార్టీ శ్రేణులు, అభిమానులు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రోలుగుంట : రోలుగుంట సెక్షన్ పరిధిలో చెట్టుపల్లి ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా లైనుకు సంబంధించి కాముడుపాలెం గ్రామానికి మంగళవారం విద్యుత్‌కోత ఉంటుందని ఆ శాఖ నర్సీపట్నం ఈఈ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు. ఈ లైనులో ఉన్న చెట్లకొమ్మల తొలగింపు, లైను మరమ్మతుల పనుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకారం



ఎం.కోడూరు పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్ ఇతర సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : ఎం. కోడూరు గ్రామంలో పీఏసీఎస్ నూతన త్రిసభ్య కమిటీ పాలకవర్గం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పడాల చాణిక్య, సభ్యులుగా కె. బాలరాజు, పి. సత్యనారాయణ సంఘ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘ సీఈవో బంటు రామునాయుడుతో పాటు సంఘ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మాడుగుల రూరల్ : మాడుగుల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో జరుగుతుందని, ఎంపీడీవో కె.అప్పారావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన జరుగుతుందని, ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

అశోక్ గజపతిరాజు నియామకంపై హర్షం

అనకాపల్లి టౌన్: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడంపై అనకాపల్లి క్షత్రియ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నీతి నిజాయితీకి మారుపేరు అయిన అశోక్ గజపతిరాజు ప్రజలకు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సంస్థ ప్రతినిధి పెనుమత్స వెంకటేశ్వరరాజు, పూసపాటి భరత్ బాబు, ఉప్పలపాటి మధు తదితరులు ఉన్నారు.

హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలి



వసతి గృహాన్ని సందర్శించిన అధికారి శ్రీదేవి

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి ఎస్‌సీ కాలనీ సమీపంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి శ్రీదేవి ఆదేశించారు. సోమవారం ఆమె వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డార్మిటరీలను పరిశీలించారు. వసతి గృహంలో అదనపు గదులు, మరుగుదొడ్లు నిర్మాణంలో ఉండటం, కొన్ని మరమ్మతు పనులు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం విద్యార్థులు ఉండే డార్మిటరీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వసతి గృహంలో ఆవరణ అంతా పిచ్చిమొక్కలు, గడ్డి ఉండడంతో తక్షణమే తొలగించాలని సూచించారు. ఆరుబయట మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బంది పడకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో కుంచం నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు..స్తంభాలు మరిచారు..



రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

నాతవరం : కోట్లాది రూపాయలు వ్యయంతో రోడ్డు నిర్మించారు, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్పు చేయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా దర్శనమిస్తున్నాయి.మండలంలో చమ్మచింత గ్రామం నుంచి సరుగుడు పంచాయతీ వరకు అర్ అండ్‌బి రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఇటీవల కాలంలో తారు రోడ్డు విస్తరణ పనులు చేశారు. చమ్మచింత గ్రామంలో గ్రామస్తుల అభీష్టం మేరకు తారురోడ్డుకు బదులుగా సిమెంటు రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మించకముందే పాత రోడ్డులో ఉండే విద్యుత్ స్తంభాలు మార్పు చేయకుండా రోడ్డు మధ్యలో అలా ఉంచేసి సిమెంటు రోడ్డు వేశారు. ప్రస్తుతం ఈరోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తుండడంతో ఏసమయంలో ఏప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ లేని సమయంలో అదమరిచి వాహనాలు నడిపే వారు కచ్చితంగా ప్రమాదాలకు గురి అవుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. రోడ్డులో కొత్తగా వచ్చే వాహనదారులకు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు ఆకస్మికంగా గమనించి ఆందోళన చెందుతున్నారు. గ్రామం మధ్యలో విశాలంగా సిమ్మెంటు రోడ్డు వేయడంతో వాహనదారులు మీతిమీరిన వేగంతో ప్రయాణాలు సాగిస్తున్నారు. రోడ్డు మధ్యలో ఉండే విద్యుత్ స్తంభాలు మార్పు చేయకపోతే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

పచ్చిమేతతో పశువులకు ఆరోగ్యం



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల : పాడి రైతులు పశు గ్రాసం పెంపకంపై అవగాహన పెంచుకోవాలని ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు అన్నారు. సోమవారం పశు గ్రాస వారోత్సవాలులో బాగంగా స్థానిక మరిడిమాంబకాలనీలో పాడి రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పాడి పశువులకు పచ్చి మేత మేపడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు పశువుల్లో పునరుత్పత్తి పెరుగుతుందన్నారు. ప్రస్తుతం పశువైద్యశాలలో 75 శాతం రాయితీతో అందుబాటులో కాకిజొన్న పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 5 కిలోల విత్తనాలు రూ 460 కాగా రాయితీ రూ.345 పోను రైతు రూ.115 చెల్లించాలన్నారు. సంకర జాతి, ఆవులు, గేదెలకు అధిక పాలదిగుబడి రావాలంటే పచ్చి మేత ఎంతైనా అవసరమన్నారు. పొలాల చుట్టూ సుబాబుల్, అవిసె చెట్లు పెంచడం వల్ల వేసవిలో పశువులకు మేత కొరత ఉండదన్నారు. రైతులు పశుగ్రాస పెంపకంలో మెలకువలు తెలుసుకుంటే అధిక లాభాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు, పాడి రైతులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న శక్తి టీం సభ్యులు కనకం

కె.కోటపాడు : మహిళల భద్రతలకు పోలీస్‌శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు కె.కోటపాడు శక్తి టీం సభ్యులు కనకం అన్నారు. కె.కోటపాడు ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ సూచనల మేరకు కె.కోటపాడులో కళాశాలల విద్యార్థినులకు, చౌడువాడ హైస్కూల్ వద్ద విద్యార్థినులకు వారి భద్రతపై తీసుకుంటున్న చర్యలు, సైబర్ నేరాలపైనా సోమవారం అవగాహన కల్పించారు. కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులపై ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలకు ఎవరి వల్ల నైనా ఇబ్బందులు పడితే 1093, 112, 181, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే వెంటనే వచ్చి రక్షణ కల్పించనున్నట్టు కనకం తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీను పాల్గొన్నారు.

పరిష్కార వేదికలో 22 ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం : సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 22 ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. ఆర్డీవో ప్రజల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించారు. పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. విద్యుత్ 11కేవీ వైర్ తెగి ఎల్‌టీ మీద పడడంతో తమ ఇంట్లో టీవీ, ఫ్రిడ్జ్ కాలిపోయాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ బలిఘట్టంకు చెందిన అల్లు సత్తిబాబు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. పద్మశాలి, నాయిబ్రాహ్మణులు, శెట్టిబలిజ, హరిజన కులస్తులకు చెందిన స్మశాన వాటికలో క్రిష్టియన్‌లు దహనసంస్కారాలు అనంతరం సమాధులు కట్టడం వల్ల స్థలం లేకుండా పోతుందని, దీని వల్ల మిగిలిన వారు ఇబ్బంది పడుతున్నామని బలిఘట్టంకు చెందిన శెట్టిబలిజ, హరిజన, పద్మశాలి, నాయిబ్రాహ్మణులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మా ఆధీనంలో ఉన్న భూమి మీది కాదని..మీ భూమి వేరే దగ్గర ఉందని తహసీల్దార్ చెబుతున్నారని, తమకు న్యాయం చేయాలని నాతవరం గ్రామం ఎం.ఆదిలక్ష్మి ఆర్డీవోకు అర్జీ పెట్టుకున్నారు. అలాగే వివిధ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి.

బాలుర డ్రైవింగ్‌తో తరుచూ ప్రమాదాలు

- కొరవడిన అధికారుల నిఘా
- తరుచూ ప్రమాదాలతో ఆందోళన చెందుతున్న ప్రజలు

మాడుగుల రూరల్: పన్నెండేళ్ల వయస్సు కూడా నిండని మైనర్ బాలురు, ద్విచక్ర వాహనాలు, ఆటోవాహనాలు డ్రైవింగ్ చేస్తుండడంతో ఇటీవల కాలంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీఏ 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారికి మాత్రమే మోటారు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేస్తుంది. అయితే 12 సంవత్సరాల వయసు కలిగిన మైనర్ బాలురు బైక్‌లను, ఆటోలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తల్లిదండ్రుల కూడా పోత్సాహం ఎక్కువ కావడంతో వాహన ప్రమాదాలు తరుచూగా జరుగుతున్నాయి. మండలంలో సాగరం శివారు సాగరం కాలనీకి చెందిన ఒక మైనర్ బాలుడు బైక్ తీసి, ఎదురుగా వస్తున్న మరో వ్యక్తి బైక్ మీద వస్తుండడంతో ఆ వ్యక్తిని ఈ మైనర్ బాలుడు బలంగా ఢీకొట్టడంతో ఆ వ్యక్తికి కాలు విరిగి ఆస్పత్రి పాలయ్యారు. ఇటువంటి ప్రమాదాలు తరుచూ జరుగుతున్నా పోలీసుశాఖ తగిన చర్యలు చేపట్టలేకపోయింది. గతంలో మాడుగుల నుంచి ఎం.కోడూరు రహదారిలో కూడా మైనర్ బాలురు బైక్ మీద ప్రయాణిస్తూ ఎదురుగా వస్తున్న మరో బైక్‌స్టుని ఢీకొన్నారు. మైనర్ బాలురు డ్రైవింగ్ చేయడానికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు, మైనర్ బాలురకు పోలీసు శాఖ తగిన రీతిలో కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పనిచేయాలి

బీఎల్‌వోలతో ఈఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాలకనుగుణంగా బీఎల్‌వోలు పని చేయాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి గీతాంజలి సూచించారు. సోమవారం ఆమె మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గంలో బీఎల్‌వోలతో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలు, పోలింగ్ బూత్‌ల గుర్తింపు, సమస్యలపై నివేదికలు తయారు చేయాలన్నారు. త్వరలోనే ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు విడుదల కానున్నాయని, ఆ మేరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. బీఎల్‌వోలకు కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింహమూర్తి, డీటీ నారాయణరావు, 50 మంది బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.